ప్రజాశక్తి
గురువారం 13 మార్చి 2025 5 విజయనగరం

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తూ, ఈ ఏడాది 23,765 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో 22,930 మంది రెగ్యులర్ విద్యార్థులు, 835 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 119 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2248 మంది ఇన్విజిలేటర్లను, ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. ప్రతీ సెంటర్‌కు ఒక ఛీఫ్ సూపరింటిండెంట్‌ను, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలవుతుందని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. సమావేశంలో డిఇఒ మాణిక్యంనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిపిఎం

- 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సిందే
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- వాడవాడలా ప్రజాచైతన్యయాత్ర

ప్రజాశక్తి-శృంగవరపుకోట, జామి

పేదలకు ఎల్లప్పుడూ సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. భూమిని కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఎస్.కోటలో సిపిఎం నాయకులు పర్యటించారు. మండల కేంద్రంలో రైతులు, జగనన్న కాలనీలో ప్రజలు తమ సమస్యలను వివరించారు. పెందుర్తి నుంచి మండలంలోని బొడ్డవర వరకు నాలుగు లైన్ల రహదారిగా విస్తరించబోతున్న 516 బి జాతీయ రహదారికి మండలంలోని రెండు చోట్ల బైపాస్ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ రహదారిలో 33 ఎకరాల భూమిని రైతులు కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికే అదే రైతుల భూముల్లో నుంచి పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి సర్వేలు చేపట్టారని, పేద రైతులకు ఉన్న కాస్తంత జిరాయితీ పల్లపుభూమిని ప్రభుత్వం రైతుల అనుమతి లేకుండా బలవంతంగా తీసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. తమ్మినేని స్పందిస్తూ భూములను కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ఐదు రెట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్.కోట, అరకు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తే బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుండి భూములు తీసుకోవలసిన అవసరం ఉండదని అన్నారు. అలా కాకుండా రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే పోరాడుతామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి తాహశీల్దార్ అరుణకుమారికి వినతి అందజేశారు. అనంతరం పట్టణంలో దేవిబొమ్మ కూడలి మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగనన్న కాలనీలో పర్యటించిన ఆయనకు పేదలు పలు సమస్యలను వివరించారు. రహదారి, కాలువలు, తాగునీరు లేవని, ఇంటింటి కొలాయి పాయింట్లు ఇచ్చారే తప్ప గుక్కెడు తాగునీరు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. తమ్మినేని స్పందిస్తూ ఈ సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీ పోరాటం చేస్తామని తెలిపారు. ఈనెల18.19.20తేదీల్లో ప్రజా సమస్యలపై తాహశీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించు ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పూర్వ నాయకులు టి.అన్నపూర్ణమ్మ, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, సిహెచ్ ముత్యాలు, ఎస్.అర్జున్, రైతులు పి.సూరిబాబు, ఎం.సత్యారావు, పి.రమణ, పి.కృష్ణ, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : విజయరాంపురంలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్

భీమసింగి దళిత కాలనీలో పర్యటన

జామి మండలంలోని భీమసింగి దళిత కాలనీలో సిపిఎం నాయకుల బృందం పర్యటించి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. తమకు రహదారి, తాగునీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలు లేవని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. జిల్లా కార్యదర్శి తమ్మినేని స్పందిస్తూ సిపిఎం ఎప్పుడూ పేదల పక్షాన ఉంటుందని, ఆ సమస్యల పరిష్కారానికి ఈనెల 19న జామి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎమ్ జిల్లా నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, మీసాల రంగమ్మ, మీసాల కొండమ్మ, మీసాల లక్ష్మి నేలపు రాములమ్మ సింహాచలం రాము తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మండల కేంద్రంలో సిపిఎం నాయకులు గాడు అప్పారావు, టి.వెంకటరమణ, పివి రమణ తదితరులు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలపై విద్యుత్తు భారాలు వేసిందని, ధరలు పెంచిందని తెలిపారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారాటానికి పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జామి సత్యవతి జామి నాగమ్మ సింహాచలం తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట

దత్తిరాజేరు : ప్రజా సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరుబాట పడతామని సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, వి.లక్ష్మి తెలిపారు. దత్తిరాజేరు మండలం మానాపురంలో రైల్వే లైన్ బాధితులు సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తామని తహశీల్దార్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదని బాధితులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. ఈనెల 17న తహశీల్దార్‌ను కలిసేందుకు బాధితులంతా రావాలని నాయకులు తెలిపారు అనంతరం విజయరాంపురంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్మశానానికి రోడ్లు, కాలువలు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు వేయాలని, రచ్చబండ కట్టించాలని గ్రామస్తులు కోరారు. ఉపాధి పనులు బిల్లులు ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్నందున వాటిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్.కోట : ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

విజయనగరం టౌన్ : స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సిపిఎం నాయకులను హుకుంపేట, శాంతినగర్ ప్రాంతాల ప్రజలు కోరారు. సిపిఎం ప్రజాచైతన్యయాత్ర ఆయా ప్రాంతాల్లో సాగింది. సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణమ్మ స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు, ఇంటి పన్నులు వేయాలని , రోడ్లు, డ్రైనేజీ, కాలువలు వేయాలని ప్రజలు కోరారు, ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, సిపిఎం చేపట్టే పోరాటాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రమణమ్మ పాల్గొన్నారు

విజయనగరం : శాంతినగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న వైసిపి నాయకులు, యువకులు, విద్యార్థులు

నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలకు

వైసిపి ఆధ్వర్యాన యువత ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఇస్తామన్నా మూడువేలు భృతి ఇవ్వాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి చేపట్టిన యువతపోరులో భాగంగా నిరుద్యోగులు, విద్యార్థులు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. కంటోన్మెంట్ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి చిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బడుకొండ అప్పలనాయుడు మాట్లాడారు. రాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థు లు, యువకులను టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. ప్రకటించిన పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. ప్రజలు సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రజలు మనోభావాలతో ఆడుకుంటోందన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు పథకం, 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.1800 వంటి పథకాలేవీ అమలు చేయడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం జిమ్మిక్కులు చేయడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వైసిపి హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు కాగా, వాటిలో ఐదు కాలేజీలను ప్రారం భించామని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మెడికల్ కాలేజీ లను రద్దు చేయడం వేలాదిమంది యువకుల ఆశలను ఒమ్ము చేయడమేనన్నారు. రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం, పథకాలు అమలు, నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్ మెంట్‌కోసం పోరాడుతామని, ప్రజలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. ధర్నాలో మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య, రాజాం నియోజకవర్గ నాయకులు రాజేష్, శోభ హైమవతి, స్వాతిరాణి, పార్టీ నాయకులు, యువత పాల్గొన్నారు.

వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో లలితకు కాంస్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యూ ఢిల్లీ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 పోటీల్లో తొలిరోజు టి11 విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారిణి కిల్లక లలిత కాంస్య పతకం గెలుచుకోవడం జిల్లాకు గర్వకారణమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన పారా క్రీడాకారులు పాల్గొన్నారని, గట్టి పోటీలో సైతం అసామాన్య ప్రతిభ కనబరచిన లలిత తానేంటో నిరూపించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో విజయనగరం పేరు మారుమోగేలా చేసిందని ప్రశంసించారు. ఈ పతకం మన రాష్ట్ర క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహన్ని నింపిందని, ఇతర విభాగాల్లోనూ ఆమె పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన లలితకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో ఈనెల 14 నుండి 18 వరకు జరుగనున్న 'అస్మిత ఫెన్సింగ్ లీగ్ 2024- 25 జాతీయస్థాయి పోటీలకు విజయనగరం జిల్లా నుండి నలుగురు ఫెన్సింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిలో క్రీడాకారులు కె. అప్పలరాజు (ఇప్పి), జి.రాధ (ఇప్పి), కె.పవన్ కుమార్ (సేబర్), వై.ప్రవల్లిక (ఫాయిల్) సీనియర్ విభాగంలో పాల్గొంటారు. వీరిని డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు అభినందించారు. జాతీయస్థాయిలో పతకాలు తేవాలని ఆకాంక్షించారు.

ఇంటర్ పరీక్షలకు 579 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బుధవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ సబ్జెక్టు పరీక్షలకు 579 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 19,466 మంది విద్యార్థులకు గాను 18,887 మంది హాజరయ్యారని ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

ఎస్ఐ, యువకుల మధ్య ఘర్షణ

తనపై దాడి చేసి, అభస్యకరంగా ప్రవర్తించారని ఎస్ఐ ఫిర్యాదు

పోలీసుల అదుపులో 9 మంది యువకులు..ఎల్.కోట స్టేషన్‌లో విచారణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గుడివాడలో శ్రీ వేణుగోపాల స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన డ్యాన్సుబేబి డ్యాన్సు సందర్భంగా వల్లంపూడి ఎస్ఐ బి.దేవిపై తిరగబడిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో స్టేజ్ ముందు యువకులు డ్యాన్సు చేశారు. అక్కడికి వెళ్లిన ఎస్ఐ దేవి యువకులను అదుపు చేసేందుకు చెదరగొట్టారు. ఈ క్రమంలో కొందరు యువకులకు గాయాలయ్యాయి. దీంతో వారంతా ఎస్ఐపై తిరగబడ్డారు. కార్యక్రమాన్ని తిలకిస్తున్న తమను ఎందుకు కొట్టారంటూ గట్టిగా నిలదీశారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు ఎస్ఐ సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్సై అప్పలనాయుడు, ఎల్ కోట, కొత్తవలస పోలీస్ స్టేషన్ ఎస్ఐలుతో పాటు సుమారు 30 మంది సిబ్బంది వాహనాలపై రాత్రి ఆ గ్రామానికి చేరుకున్నారు. యువకులను గుర్తించి ఎల్.కోట స్టేషన్‌కు తరలించి, అక్కడ విచారిస్తున్నారు. గ్రామంలో ఘర్షణలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాపై దాడి చేసి, అభస్యకరంగా ప్రవర్తించారు : ఎస్ఐ దేవి

ఎస్ఐ దేవి, యువకుల మధ్య జరుగుతున్న ఘర్షణ

గ్రామంలో డ్యాన్సుబేబి డ్యాన్సు కార్యక్రమం జరుగుతుండగా, బందోబస్తు కోసం వెళ్లిన తనపై కొందరు యువకులు దాడి చేసి, అసభ్యకరంగా ప్రవర్తించారని వేపాడ ఎస్ఐ బి.దేవి ఎస్.కోట సిఐకు ఫిర్యాదు చేశారు. డ్యాన్సు చేస్తున్న యువతుల వద్దకు గ్రామానికి చెందిన యువకులు గుడివాడ మోహన్ పదేపదే వెళ్లి అభస్యకరంగా వ్యవహరించాడని, ప్రశ్నించిన తనను అసభ్యపద జాలంతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా మోహన్‌తో పాటు అతని స్నేహితులు గుడివాడ సంతోష్‌కుమార్, విష్ణుదుర్గ, హర్ష ఎర్నిబాబు, గౌరినాయుడు తనపైకి వచ్చి దుర్భాషలాడారని, తనను కొట్టి, జట్టు పట్టుకొని లాగారని, తన విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనను వీడియో తీస్తుండగా తన సెల్‌ఫోన్ పట్టుకొని పారిపోయారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఎస్.కోట సిఐ షణ్ముఖరావు 9మంది యువకులను అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరిచారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆహ్వానసంఘం ఛైర్మన్ శివానందకుమార్, డాక్టర్ జైపాలరావు

విజయనగరం సమగ్రాభివృద్ధికి

16న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సమగ్ర అభివృద్ధి కోసం రూ .10 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం ఛైర్మన్, ఆర్‌డబ్ల్యుఎస్ రిటైర్డు ఎస్‌ఇ కె.శివానందకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జివిపి జైపాల్ తెలిపారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో జ్యూట్, పంచదార, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూత పడ్డాయని, రూ.50వేల మంది కార్మికుల బతుకులు పోయాయని తెలిపారు. జిల్లాలో నీటివనరులున్నా ప్రాజెక్టులు నిర్మించడం లేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో తగిన స్టాఫ్ లేరని, సౌకర్యాలు లేవని, కేన్సర్ టెస్టింగ్ సెంటర్, కార్డియక్ టెస్టింగ్ సెంటర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు..జిల్లాలో 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉంటే 3 కళాశాలలకూ శాశ్వత భవనాలు లేవని, అన్ని విధాలా విజయనగరం అభివృద్ధి లో వెనుక బడి ఉందని అన్నారు. మామిడి, జీడి, చింత పండు, ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు నన్నారు. ఇటువంటి ఆలోచన ప్రభుత్వా లు చేసి విజయనగరం సమగ్ర అభివృద్ధి చెయ్యాలని కోరారు. ఇందుకోసం రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరుతూ నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో అన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధివేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసవాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

పిఎంఎవై ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం

- బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు
- పివిటిజిలకు ఒక్కో ఇంటికి రూ.1 లక్ష వంతున సహాయం
- జిల్లాలో 15,226 మందికి లబ్ధి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ్, అర్బన్, పి.ఎం.జన్‌మన్ పథకాల కింద గతంలో మంజూరై నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేసిన మొత్తానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయాన్ని అందించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతోందని చెప్పారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్థిక సహాయం వల్ల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పివిటిజిలకు చెందిన 15,226 మంది ఇళ్ల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 12,240 మంది బిసిలకు, 2,231 మంది ఎస్‌సిలకు ఒక్కో ఇంటికి రూ.50 వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. 565 మంది షెడ్యూల్డు తెగల వారికి రూ.75 వేలు వంతున, 190 మంది ఆదిమతెగల వారికి పిఎం జన్‌మన్ కింద ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.1 లక్ష వంతున ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఆర్థిక సహాయం వినియోగించుకొని ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలన్నారు. గతంలో మంజూరై నిర్మాణంలో వున్న ఇళ్లకు మాత్రమే ఈ అదనపు ఆర్థిక సహాయం వర్తిస్తుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఇంజనీరింగ్, సంక్షేమ కార్యదర్శులు ఈ నెల 18 నుంచి 22 వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని చెప్పారు.

బొంబాయి ఐఐటి సహకారంతో

'సీతం'లో ఇ-యంత్ర రోబోటిక్స్ సెంటర్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బొంబాయి ఐఐటి సహకారంతో ఇసిఇ విభాగంలో ఇ-యంత్ర రోబోటిక్స్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడానికి రోబోటిక్స్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని పెపొందించేందుకు సహాయపడుతుందని, ప్రత్యేకమైన అవకాశాలను అందిస్తుందని తెలిపారు. ఐఐటి-బొంబాయి వారు నిర్వహించిన పరీక్ష లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ ,గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు తమ సొంత స్టార్టప్ లను ప్రారంభించడానికి ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందడానికి రోబోటిక్స్ సెంటర్ దోహదపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టిడివి నాయుడు, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రం అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఝాన్సీలక్ష్మి

సారా రహిత జిల్లాగా మార్చాలి

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 14405 : కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. నాటు సారాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 14405కు విస్తత ప్రచారం కల్పించాలని సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో నాటుసారా నిర్మూలన సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ గ్రామంలో ఎక్కడా సారా తయారీ గానీ, వినియోగం గానీ జరగడం లేదని అన్ని గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలను తీసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత, ఇప్పటికే సారా తయారీ, వినియోగం జరుగుతున్నట్లు గుర్తించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అబ్కారీ శాఖతోపాటు పోలీసులు, అటవీశాఖ కూడా నాటు సారా తయారీపై నిఘా పెంచాలని సూచించారు. అటవీ ప్రాంతంలో ఎక్కడైనా సారా తయారీ జరిగితే, దానికి అటవీశాఖదే బాధ్యత అని స్పష్టం చేశారు. సారా తయారీదార్లపై ఉన్న కఠిన శిక్షలు, వినియోగించే వారికి కలిగే అనర్థాలపై విస్తత ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం నవోదయం 2.0 కు సంబంధించిన గోడపత్రికలను, స్టిక్కర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రచార రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఎక్సైజ్ సహాయ కమిషనర్ పి.రామచంద్రరావు మాట్లాడుతూ, జిల్లాలో నవోదయం కార్యక్రమం అమలు, నాటుసారా తయారీ తదితర అంశాలను వివరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటిండెంట్ బి.శ్రీనాధుడు, అటవీశాఖాధికారి కొండలరావు, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జాతీయ రహదారిపై 64 సిసి కెమేరాలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, కారణాలను గుర్తించేందుకు జాతీయ రహదారిపై 64 సిసి కెమేరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జరిగింది. విజయనగరం డివిజన్‌లో గుర్తుతెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, క్షతగాత్రులుగా మారిన మొత్తం 10కేసులపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హిట్ అండ్ రన్‌కు సంబంధించిన కేసులు ఏవీ పెండింగ్లో లేకుండా వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 34 కిలోమీటర్ల మేర ఉన్న 16వ జాతీయ రహదారిపై 64 సిసి కెమేరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లు, నేరాలు జరిగే చోట్లను దశలవారీగా అన్నిచోట్లా సిసి కెమేరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికోసం సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి సౌమ్యలత, ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిటిఒ మణికుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఒ జీవనరాణి, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరాయిలో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల వెల్నెస్ సెంటర్లో బుధవారం 104 వైద్య సేవలు అందించారు. 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అజయ్, సబ్ సెంటర్ సిహెచ్ఒ బి పార్థసారధి, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సాయి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

అర్హులైనవారందరికీ ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని 1,2,3 అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఇఒలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం ఉన్నత పాఠశాల, కొంపల్లి, దగ్గ పేట పాఠశాలలను ఎంఇఒలు జి.నాగభూషణరావు, పి.బాబాఅప్పారావు బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. పిల్లల భవిష్యత్తుకు ఇదే ప్రథమ మెట్టు అని విద్యార్థులకు సూచించారు. అనంతరం పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ద్వారపూడిలో ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి- విజయనగరం కోట

వృద్ధురాలికి వైద్యం అందిస్తున్న డాక్టర్

జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం ద్వారపూడిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి ఆదేశాల మేరకు ద్వారపూడి మహాత్మా గాంధీ వృద్ధాశ్రమం వద్ద ఈ శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు జిల్లా పిఒఆర్‌సిఎస్‌ఇ, ఆర్కెఎస్కె, ఎన్‌సిడి అధికారి డాక్టర్ వివిబి సుబ్రమణ్యం, దంత వైద్య నిపుణులు డాక్టర్ రవిశేఖర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వినీత్, గైనకాలజిస్ట్ డాక్టర్ అర్చన, ఫిజియోథెరపిస్ట్ స్వాతి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ నాయుడు, ఎంఎల్‌హెచ్‌పి సునీత, మెంటల్ హెల్త్ డిపార్ట్మెంట్ నుండి క్లినికల్ సైకాలజిస్ట్ సిహెచ్ రాజు, మంగమ్మ, సాయి రమణి, డిఈఐసి సోషల్ వర్కర్ సిహెచ్ సన్యాసిరావు, ఎంసిడి నుంచి కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తవలస

వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతూ తప్పనిసరిగా భూ ఆధార్ నమోదు చేసుకోవాలని ఎడిఎ ఎల్.విజయ రైతులకు సూచించారు. బుధవారం సంతపాలెంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతు సేవ కేంద్రాలలో తప్పనిసరిగా రబీ ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. సామాజిక తనిఖీ కోసం అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని మీ వివరాలు తప్పుగా నమోదు చేసినట్టయితే రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలని, వాటిని సరి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాధురి శరణ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.హేమ, ఎన్. దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠశాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పిసిఎల్ సౌజన్యంతో దెందేరు హైస్కూల్ విద్యార్థులకు బుధవారం పాఠశాల కిట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం బి.సునీత చేతుల మీదుగా షూష్, రెండు టీ షర్టు, స్వెటర్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్‌డిఒ రామ్మోహనరావుకు మాజీ సైనిక ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రామినాయుడు, అధ్యక్షులు ఆర్.శిరణ్ కుమార్ కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. మాజీ సైనికులు, వితంతువులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరగా ప్రభుత్వ భూమి గుర్తించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఎ గోవింద నాయుడు, ట్రెజరర్ వియన్ శర్మ, మాజీ సైనికులు, వీర సైనికుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి - బొబ్బిలి

సిబిఎం బాలికోన్నత పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ విద్యార్థి సమాఖ్య నాయకులు రవికుమార్, కోట అప్పన్న, సాయికిరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు వ్యతిరేకంగా గంటి ప్రసాదం భవనంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాల గుర్తింపు రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కె.అప్పలరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ రుణాలు అందిస్తుందని, బిసి కులస్తులు, ఇడబ్ల్యుఎస్ కులస్తులు సబ్సిడీ రుణాల కోసం ఒబిఎంఎంఎస్ ద్వారా సచివాలయంలో ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓక్లాండ్ విద్యార్థికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షలో తొలి స్థానం సాధించిన మండలంలోని ఓక్లాండ్ పాఠశాల విద్యార్థిని దాసరి లిఖితకు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వెంకటేష్, రవి మెమెంటోతోపాటు ప్రశంసా పత్రం బుధవారం అందజేశారు. పరీక్షలో మంచి నైపుణ్యం కనబరిచిన లిఖితను వారు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రజ్ఞా వికాసం పరీక్ష ద్వారా వెలికి తీస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధిని అభినందించారు. వారితో పాటు ప్రిన్సిపాల్ సిహెచ్ రవి, ఉపాధ్యాయులు లిఖితను ప్రశంసిస్తూ, ఆమె భవిష్యత్తు చదువుకుని భవిష్యత్తులో మరెన్నో ఉన్నత స్థాయిలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస కుడి ప్రధాన కాలువలో ఓ తల్లి ఇద్దరు పిల్లలతో సహా ఈనెల 11న ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో తల్లి బాలుడు సురక్షితంగా ఒడ్డుకు చేరినప్పటికీ బాలిక కాలువలో గల్లంతైన విషయం విధితమే. గల్లంతైన బాలిక సైని (6) మృతదేహం ఘటన జరిగిన సమీపంలో బుధవారం లభ్యమైందని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. బాలిక మృతదేహాన్ని చూసి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలిక మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బాలిక బంధువులకి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆటో నుంచి జారిపడి ఆరోగ్య మిత్ర మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య మిత్రగా విధులు నిర్వహిస్తున్న శీర గౌరునాయుడు(50) ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు ముగించుకొని మంగళవారం సొంత గ్రామం పక్కి వెళుతుండగా మార్గమధ్యలో పక్కి గ్రామంలో ఆటో నుండి జారిపడి తలకు తీవ్రగాయం కావడంతో ఆటోలో బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకెళ్లిపోవాలని వైద్యులు తెలియజేయడంతో క్షతగాత్రుని సొంత గ్రామానికి తీసుకువస్తుండగా. ఇంటి వద్ద గౌరినాయుడు బుధవారం మృతి చెందినట్లు మృతుని భార్య సరస్వతి బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గౌరినాయుడు మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.40 కోట్లు

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ఈ ఏడాది కాంప్రెన్సివ్ ప్రొటెక్టివ్ వాటర్ స్కీమ్ కింద రూ.40 కోట్లతో 34 రక్షితనీటి పథకాలు మంజూరైనట్టు జెడ్‌పి సిఇఒ వెంకటరమణ తెలిపారు. నీటి ఎద్దడి ఎక్కువ ఉన్న మండలాల్లో ఈ పథకాలు నిర్మాణం చేయనున్నామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పథకాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా ప్రతీ మండలంలో క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా బోర్డు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా మండలాల్లో నీటి ఎద్దడికి సంబంధించి నిధులు ఖర్చులు చేసుకొనేలా సూచించామన్నారు. ప్రతీ మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, తాగునీటి సమస్యలపై ఇక్కడ ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతీ మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి సంబంధించి మ్యాప్ ఒకటి ప్రదర్శించాలని, ఈ మ్యాప్‌లో హైస్కూళ్లు, రోడ్లు, ముఖ్య సమాచారం పొందుపరచాలని సూచించారు. పి4 సర్వేపై అపోహలు వద్దని, పేదరిక నిర్మూళన కోసం ప్రభుత్వం ఈ సర్వే చేస్తోందని, దీని వల్ల ఎటువంటి సంక్షేమ పథకాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 38.85 శాతం పి4 సర్వే పూర్తయిందన్నారు. జిల్లాలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టుల కొరత ఉందని, త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల్లో సంపద పెంచే మార్గాలు అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ కేంద్రాల వద్ద ఒక బోరు నిర్మాణం కూడా చేపట్టి బలోపేతం చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల పనితీరుపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిపిఆర్‌సి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బీఎస్కే పట్నాయక్, ఎంపిడిఒ రత్నం, ఎఒ సన్యాసిరావు, మండల పరిషత్ సినియర్ అసిస్టెంట్ చొక్కావు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సిఇఒ వెంకటరమణ

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటరమణ

సంగిడిరాళ్ల పోటీలో తలబడుతున్న యువకులు

ఆకట్టుకున్న సంగిడి రాళ్ల పోటీలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో కనకదుర్గమ్మ అమ్మవారి పండగ సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన సంగిడి రాళ్ళ పోటీలు ఆకట్టుకున్నాయి. ఇసురు, తీత, ఫోటు వంటి మూడు విభాగాలను నిర్వహించి గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు కందుల రఘుబాబు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఇసురు, తీత, పోటు ఈ మూడు విభాగాల్లో బొండపల్లి మండలం అంబటివలసకు చెందిన పాలూరి వెంకటేష్ మొదటి బహుమతులు సాధించాడు. గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన గొల్లు కుమార్ కూడా ఈ మూడు విభాగాల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. భోగాపురం మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన బాకీ శ్రీను తృతీయ బహుమతి సాధించాడు. ఆల్ రౌండర్ విభాగంలో ఇదే గ్రామానికి చెందిన బోర గోవిందతో సహా అందరికీ కందుల రఘుబాబు చేతుల మీదగా నగదు ప్రోత్సకాలను అందజేశారు. గ్రామ పెద్దలు కొమ్మూరు సుభోసనరావు, ఆళ్ల ఉదయ బాబు, పడాల భాను ప్రకాష్, కొమ్మూరు చిన్నదొర, వాసు బాబు, వెంకటేష్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ కావాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

పూసపాటి రేగ మండలానికి మోడల్ స్కూలు, భోగాపురం మండలానికి జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం-భోగాపురం ఐటీ కారిడార్‌లో కొత్త వ్యాపారవేత్తలకు ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక కర్మాగారాలను దృష్టిలో ఉంచుకుని, యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, స్థానికంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివద్ధి కేంద్రాల ఏర్పాటుతో స్థానిక యువతకు అవసరమైన శిక్షణను అందించడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన కార్మిక శక్తిని తయారుచేసే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు.

తడి నేలల పరిరక్షణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. దీనికోసం ముందుగా చెరువులు తదితర జలవనరుల సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. జిల్లా తడి నేలల (వెట్ ల్యాండ్స్) కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ముందుగా జిల్లాలో చెరువులు, కాలువలు తదితర తడి నేలలను సర్వే చేసి జాబితా తయారు చేయాలని సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ రికార్డులతోపాటు ఇతర రికార్డులను కూడా పరిశీలించి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా జిల్లాలో 2,263 తడి నేలలను గుర్తించామని, వీటిలో 2,191 నేలలకు గ్రౌండ్ ట్రూతింగ్ కూడా పూర్తి అయ్యిందని చెప్పారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వందలాది చెరువులు ఉన్నాయని, అలాగే మంచినీటి చెరువులు కూడా చాలాచోట్ల ఉన్నాయని చెప్పారు. అందువల్ల సమగ్ర సర్వే నిర్వహించిన తరువాతే, జలావాసాలను, తడి నేలలను ఖరారు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనికోసం మండల స్థాయిల్లో ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయితీ, సర్వే, వ్యవసాయ, ప్రజారోగ్య, మత్స్య, పశు సంవర్థక శాఖాధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి, ఈ నెల 15లోగా జాబితాలను రూపొందించాలని ఆదేశించారు. ముందుగా జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జలావాసాలు, తడి నేలలను సంరక్షించాల్సి ఉందని అన్నారు. వివిధ శాఖల సహకారంతో, అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, పబ్లిక్ హెల్త్ ఇఇ జ్యోతి, పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, సర్వే ఎడి రమణమూర్తి, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన పామాయిల్ రైతుల సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ 2.50లక్షల హెక్టార్లలో 2లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. పామాయిల్‌కు కనీస మద్దతు ధర రూ.20వేలుకు తగ్గకుండా ఇవ్వాలని కోరారు. పామాయిల్ సాగుకు పెట్టుబడులు పెరుగుతున్న మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పామాయిల్‌కు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

తప్పులు సరిదిద్దుతా.. క్షమించండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీపురుపల్లి శాఖలో వినియోగదారులకు ఇబ్బందులను భవిష్యత్తులో జరగకుండా తప్పులు సరిదిద్దుతాను క్షమించండి అంటూ ఆ శాఖ ఎజిఎం ఎం సురేష్ కుమార్ బ్యాంకు ఖాతాదారులకు క్షమాపణ చెప్పారు. చీపురుపల్లి స్టేట్ బ్యాంక్ శాఖలో ఒకరిద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన వారంతా బ్రాంచ్ మేనేజర్‌తో కలుపుకొని వినియోగ దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ పలువురు ఖాతాదారులు స్టేట్ బ్యాంక్ శాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం సాయంత్రం స్థానిక శాఖలో ఖాతా దారులతో పాటు ఉద్యోగులను కూడా సమావేశ పరిచి ఎజిఎం వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినియోగ దారులు ఒక్కొక్కరిగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎజిఎం దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులంటే కనీస గౌరవం లేకుండా బ్యాంకు ఉద్యోగులు తమని అవమాన పరుస్తున్నారంటూ, ఒక్క నిమిషం లేటయినా పని పూర్తి చేయ డానికి నానా తిప్పలు పెడుతున్నారని ఎజిఎంకు వివరించారు.

వినియోగదారులను వేడుకున్న ఎస్‌బిఐ ఎజిఎం

వినియోగదారులతో మాట్లాడుతున్న ఎజిఎం సురేష్‌కుమార్

ఈ సందర్భంగా ఎజిఎం ఖాతాదారులతో మాట్లాడుతూ బ్యాంకులో ఎజిఎం స్థాయిలో ఉన్నప్పటికీ చీపురుపల్లి శాఖకు సంబంధించి భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా బ్యాంక్ మేనేజర్ స్థాయి ఉద్యోగాన్ని కూడా తన బాధ్యతగా తీసుకుంటానని వినియోగదారులకు వివరించారు. ఏడాది కాలంగా ఈ శాఖలో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఆయన మందలించారు. భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులున్నా ఖాతాదారులు నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ఎజిఎం తన ఫోన్ నెంబర్‌ను వినియోగదారులకు అందజేశారు. ఫిర్యాదు చేసే వినియోగదారులు కూడా ఏ ఉద్యోగి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారో పేరుతో పాటు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. బ్యాంకు వేళలను ఉద్యోగులు ఎందుకు కచ్చితంగా పాటించడంలేదని, నాలుగు గంటలకే బ్యాంకును ఎందుకు క్లోజ్ చేయవలసి వస్తుందని ఆయన ఉద్యోగులను ప్రశ్నించారు. వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించడంతోపాటు ఉద్యోగులంతా పని వేళల్లో వినియోగదారులకు అందుబాటులో ఉండాలని ఎజిఎం ఉద్యోగులను హెచ్చరించారు. శాఖలో ప్రతి ఖాతాదారుడికి గౌరవప్రదమైన సేవలు అందజేయకపోతే ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బ్యాంక్ ఉద్యోగులతో పాటు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బొబ్బిలి

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆర్‌డిఒ రామ్మోహనరావు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా లైటింగ్, తాగునీరు ఏర్పాటు చేయా లన్నారు. పరీక్షలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షలలో చూసి రాతలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్లకోమాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బొబ్బిలి

కంటికి వచ్చే వ్యాధుల్లో గ్లకోమా ప్రమాదకరమైందని దానిపై అవగాహన పెంపొందించుకోవటం వల్ల నివారణ, నియంత్రణ సులభమౌతుందని బొబ్బిలి కంటి ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ కెవి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక బొబ్బిలి కంటి ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ గ్లూకోమా వారోత్సవాల్లో భాగంగా గ్లూకోమాపై అవగాహన కార్యక్రమాన్ని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ గ్లూకోమా వ్యాధి కంటి లోపల ఒత్తిడి పెరగటం వల్ల కంటి నరాలకు నష్టం కలిగే కంటి వ్యాధని దీన్ని నీటి కాసులు అని కూడా అంటారని అన్నారు. అధిక ఒత్తిడి కంటి వెనుక భాగంలో ఉండే ఆప్టిక్ నరంకి నష్టం కలిగిస్తుందని, ప్రారంభ దశలో పెద్దగా ఎలాంటి లక్షణాలు కనిపించనప్పటికి క్రమంగా కంటిచూపు సన్నబారి చివరకు అంధత్వం వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఇది వంశపారం పర్యంగా వస్తుందని, ప్రతి 6 నెలలకు ఒకసారి గ్లూకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ గ్లూకోమాను అదుపు చేయటానికి చుక్కల మందులు, శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభివీక్ సంస్థ ప్రతినిధులు నక్షత్ర, శ్రీనివాస అయ్యప్పన్, శ్రీనివాస్‌లు గ్లూకోమా వ్యాధి, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం రోటరీ సభ్యులు శ్రీహరి, గేంబలి శ్రీనివాసరావు, కృష్ణ మోహన్, శ్రీనివాసరావులు డాక్టర్ అప్పారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కంటి డాక్టర్ అప్పారావు


డాక్టర్ అప్పారావును సత్కరిస్తున్న జెసి రాజు, తదితరులు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూసపాటిరేగ వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం లేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, నల్లపురాజు సత్యనారాయణ, జిల్లా బిసి సెల్ కార్యదర్శి జనార్ధనరావు, నాయకులు శ్రీనువాసరావు, డి. త్రినాదరావు, మొంగం నాగబాబు, గుజ్జు సురేష్‌రెడ్డి, సర్పంచి టొంపల సీతారాం పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ కేక్ కట్ చేశారు.

పూసపాటిరేగ: కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

అసంతృప్తి కౌన్సిలర్లు డుమ్మా

ఆవిర్భావ దినోత్సవానికి అసంతృప్తి కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు 9మంది వైసిపి కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. వీరితో విజయనగరంలో జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించి తొందర పడవద్దని చెప్పినా వీరు డుమ్మా కొట్టడంపై చర్చనీయాంశమైంది.

ఆర్థిక పరిస్థితుల అంచనాకే సర్వేలు

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రజల ఆర్థిక పరిస్థితులు అంచనా వేసేందుకు ప్రభుత్వ సూచనలతో సర్వేలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రత్నం తెలిపారు. బుదవారం ఆరికతోట గ్రామ పంచాయతీలో జరుగుతున్న పి4, డబ్ల్యుఎఫ్‌హెచ్ సర్వేలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలపై అపోహలు తగవు అని ప్రతీ కుటుంబ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి, ప్రభుత్వ ప్రాజెక్టుల ద్వారా అవసరమైన కుటుంబాలకు ప్రైవేటుగా సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ఈ సర్వే డేటా అప్లోడ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఈ సర్వేలకు ఎటువంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. అనంతరం అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి నిబంధనల మేరకు సెంటర్ పనితీరు, రికార్డులు విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వేపాడలో నిర్వహిస్తున్న పి4 సర్వేను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వే వివరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్లు గొర్రె రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వంద వాహనాల్లో జనసేన సభకు

ప్రజాశక్తి - భోగాపురం

జనసేన పార్టీ ఆవిర్భావ సభకు మండలం నుంచి వంద వాహనాల్లో బయలుదేరి వెళ్తున్నామని జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని నాయకులతో ఆయన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు సభకు వెళ్లేలా చూడాలని శ్రీనివాసరాజు అన్నారు. అనంతర ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం మాధవి ఆధ్వర్యంలో మండలం నుంచి భారీ ఎత్తున ఆవిర్భావ సభకు వెళుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి సుమారు 2000 మంది వెళు న్నారని అన్నారు. భోగాపురం మండలంలోని నాయకులందరూ శుక్రవారం ఉదయాన్నే భోగాపురం పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరుతున్నారని తెలిపారు. నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, వందనాల రమణ, మైలపల్లి అప్పలకొండ, నరసింహులు, చెల్లుబోయిన రాము, కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ పి.సుదర్శన రావు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే వారికి తాగునీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రవిశంకర్, ఎలక్షన్ డిటి వివిఆర్ జగన్నాథ రావు, సత్యనారాయణ, మండల సర్వేయర్ టి.దివ్య మానస, తర్లాడ శంకరరావు, విఆర్ఒ వెంకటలక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
I.A.No.163/2024 OS 28/2024

వాదులు :- విలమందిపర్తి కృష్ణమ్మ వగైరా
ప్రతివాదులు:- విలమందిపర్తి సూర్య నారాయణ మూర్తి మరియు 14 వగైరా.

యిందలి వాదులు/పిటిషనర్లు A,B,C షెడ్యూల్ ఆస్తులు 8 భాగాలుగా విభజన చేయమని 12, 15 ప్రతివాదులుగా గవర్నమెంటు వారు 1వ వాది భర్త మరణానంతరం రావలసిన బెనిఫిట్స్ మరియు 2వ వాదికి ఉద్యోగం కల్పించమని 1 నుండి 15 ప్రతివాది/ రెస్పాండెంట్లుకు తెలియజేయుటకు అనేక పర్యాయములు నోటీసులు, సమన్స్ తీసుకొనకుండా తప్పించుకున్నందున IA 163/2024 పిటిషన్. ఇందు 1 నుండి 7 రెస్పాండెంట్లు తీసుకొనందున ఈ ప్రకటనే నోటీసుగా భావించి **తే 19-3-2025** దిన కోర్టుకు స్వయంగా హాజరై మీ అభ్యంతరములు తెలుపగలరు. లేని యెడల పరోక్షంగా, వాదులకు అనుకూలంగా ఆర్డర్ జారీ చేయబడును.

ఇట్లు
జె.మధుసూదనరావు
న్యాయవాది, పార్వతీపురం,
Cell : 9440165169